నీట్ పరీక్షపై ప్రధాని స్పందించాలి

కాచిగూడ: నీట్ పరీక్ష విషయంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ ఈ మేరకు లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం తగదని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ పెద్ద స్కాం అని, ఒక్కో అభ్యర్థికి రూ.30 లక్షల చొప్పున పేపర్‌ను అమ్ముకున్నారనే వార్తలోస్తున్నాయని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పోరాటం చేస్తామని తెలిపారు.

సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్‌ను నియమించినట్లు సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవనాయక్ తెలిపారు. బాగ్‌లింగంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న త్రిసభ్య కమిటీ పూర్తిగా విఫలమైందని, దానిని రద్దు చేసి పంచ సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేనా రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సేవాలాల్ సేనా కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్, వ్యవస్థాపక ధర్మ జాగరణ జాతీయ అధ్యక్షుడిగా రమేశ్ మహరాజ్, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా స్వరాజ్ నాయక్, ఉద్యోగ సేనా రాష్ట్ర ఇన్‌చార్జిగా మూడావత్ కృష్ణానాయక్, కోకన్వీనర్లుగా బానోత్ హుస్సేన్‌నాయక్, వెంకన్ననాయక్, అజయ్‌నాయక్, మోతీలాల్‌నాయక్, భాస్కర్‌నాయక్, కొర్రా శ్రీను, రాజేశ్‌నాయక్, బానోత్ బాలునాయక్, శంకర్‌నాయక్, హైదరాబాద్ సీనియర్ నాయకులు కల్యాణ్‌నాయక్, శశిప్రసాద్, బానోత్ కిషన్ నాయక్, రవినాయక్, రాముంనాయక్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు అరికట్టాలి



కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య

కాచిగూడ: నగరంలోని ఫుట్‌పాత్‌ల్లో మొక్కలు నాటి ఆక్రమణలకు చెక్ పెట్టాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య కోరారు. నారాయణగూడలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా ఆక్రమణలతో ఉన్న ఫుట్‌పాత్‌లను కాపాడాల్సిన మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతోనే ఆక్రమణదారులు పెట్రేగిపోతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమిషనర్ పోలీస్ ఉన్నతాధికారుల సమన్వయంతో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని విజ్ఞప్తి చేశారు. పరిస్థితుల్లో మార్పు రాకుంటే సమస్యపై కౌన్సిల్ తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

బీటెక్ సైబర్ సెక్యూరిటీ కోర్సు టాపర్‌గా శ్రేయ



టాపర్‌గా నిలిచిన విద్యార్థిని కట్టెల శ్రేయ

నల్లకుంట: బీటెక్ సైబర్ సెక్యూరిటీ కోర్సులో నల్లకుంటకు చెందిన కట్టెల శ్రేయ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి టాపర్‌గా నిలిచింది. మేడ్చల్ జిల్లా కొంపల్లి సమీపంలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగేళ్ల బీటెక్ సైబర్ సెక్యూరిటీ కోర్సులో విద్యనభ్యసించిన 2020 బ్యాచ్‌కు చెందిన శ్రేయ ప్రతి సంవత్సరం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి అకాడమిక్ టాపర్‌గా నిలిచింది. కళాశాల ప్రాంగణంలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి శ్రేయకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రేయ తల్లిదండ్రులు అనిత, నర్సింగ్‌రావు పటేల్ ఆమెకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ బడి మసీదు వద్ద బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

గాంధీనగర్ డివిజన్‌లో భారీ వర్షం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధానరోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలో జవహర్‌నగర్ ప్రధానరోడ్డులో నీరు చేరడంతో రాకపోకలకు అంతరరాయం ఏర్పడింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డీఆర్ఎఫ్ బృందాలు చేరుకుని వరద నీరు సాఫీగా వెళ్లేలా మ్యాన్‌హోళ్ల వద్ద చర్యలు తీసుకున్నారు.



వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్న డీఆర్ఎఫ్ బృందం



అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో బక్రీద్

జోరుగా కుర్బానీ..సామూహిక ప్రార్థనలు

బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో, ముషీరాబాద్ భోలక్‌పూర్‌లో గల మసీదుల్లో తెల్లవారుజామునే సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు వద్ద చిక్కడపల్లి ఏసీపీ రమేశ్‌కుమార్, సీఐ నిరంజన్ బందోబస్తు నిర్వహించడంతో పాటు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
–ముషీరాబాద్/ అంబర్‌పేట్



భోలక్‌పూర్ బడి మసీదులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





సిద్ధిఖీనగర్‌లో డాక్టర్ శేఖర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న అక్లక్ హుస్సేన్



ప్రార్థనలు చేయిస్తున్న మత పెద్దలు

బాలమణి యాదవ్‌కు ఘన నివాళి

కాచిగూడ: బీజేపీ ఓబీసీ విభాగం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో కాచిగూడ చెప్పల్‌బజార్‌లో ప్రముఖ సంఘ సేవకురాలు సి.బాలమణి యాదవ్ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు, మహిళలు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం ఏర్పాటు చేసి ఆసుపత్రుల్లో పండ్లు, కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌లపై ఉండే వారికి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, యాదవ సంఘం చైర్మన్ నందకిశోర్ యాదవ్, సి.వివేక్, లక్ష్మణ్, శేఖర్, ప్రమోద్, తేజేందర్, విజయ, శారద, శైలజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బాలమణి యాదవ్‌కు నివాళులర్పిస్తున్న వినోద్ యాదవ్, నందకిశోర్ తదితరులు

సాఫ్ట్‌వేర్ కోర్సుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు ప్రతీ విద్యార్థి నేర్చుకోవాల్సిన 50కి పైగా లేటెస్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరినిన వివరాలకు సెల్ నంబర్ 9505800050లో సంప్రదించాలని కోరారు.

డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు



ఇందిరాపార్కులో నాన్నలను సత్కరిస్తున్న బి. సరోజినీరామారావు

కవాడిగూడ: ఫాదర్స్‌డే ను పురస్కరించుకుని రామకృష్ణ మఠంలో యోగానంద రఘుమహారాజు, నవ భారత్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల సేవా విభాగంలో నాన్నపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను సోమవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ.. నాన్న మాటను అర్థం చేసుకుంటే సరైనా దారిలో నడవగలమని పేర్కొన్నారు. అనంతరం ఇందిరాపార్కులో యోగా గురువు బి. సరోజినీ రామారావు ఆధ్వర్యంలో నాన్నలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.స్వరూపారాణి, శోభారాణి, సరోజినీ రామారావు, జి. కృష్ణవేణి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ హిప్నో కమలాకర్

ఏకగ్రీవంగా ఎన్నిక



ఆకుల నరేశ్ బాబు

కాచిగూడ: బర్కత్‌పురలోని రాష్ట్ర ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ ఆకుల నరేశ్ బాబు ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా నరేశ్ బాబు తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు సామాజిక సమరసతా వేదిక అఖిల భారత కన్వీనర్ శ్యాంప్రసాద్, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాష్ట్ర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి



రమణ, కృష్ణప్రసాద్, రాజన్‌ను పురస్కారంతో సన్మానిస్తున్న గీత, ఆమని, లక్ష్మీనారాయణ

చిక్కడపల్లి: గీతా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అమర గాయకులకు స్వరార్చన శీర్షికతో త్యాగరాయగానసభలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ప్రముఖ మెలోడికింగ్ గాయకులు రమణ, కృష్ణప్రసాద్, రాజన్‌కు సుబ్రహ్మణ్యం స్ఫూర్తి పురస్కారం-2024ని ప్రదానం చేసి సన్మానించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షురాలు గీత పర్యవేక్షణ చేసిన కార్యక్రమంలో నవరస గాయని ఆమని, ప్రముఖులు లక్ష్మీనారాయణ, కుసుమ భోగరాజు, కె.రమేశ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ –యాకుత్‌పురా రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (35) పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆ విభాగం అధికారులు, సిబ్బంది నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నిత్యం రోడ్లపై విధులు నిర్వహిస్తూ.. ఎక్కడ ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం వేలాది వాహనాల సంచారం.. ప్రజల రాకపోకలు ట్రాఫిక్ సందడితో కిటకిటలాడే ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.

ప్రజల సౌకర్యార్థం సంప్రదించాల్సిన నంబర్లు..

- ఎస్. వెంకటేశ్వర్లు(ఏసీపీ) 87126 60613
- బి.వెంకట్ రాములు(గోపాలపురం ఇన్‌స్పెక్టర్) 87126 60621
- పి. ఉపశంకర్(మహంకాళి ఇన్‌స్పెక్టర్) 87126 60622
- జి. భాస్కర్(మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్) 87126 60625
- ఎల్. మధుబాబు(తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్) 87126 60624
- పి. పాపయ్య(బేగంపేట్ ఇన్‌స్పెక్టర్) 87126 60632
- వి. నాగయ్య(బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్) 87126 60751
- సీహెచ్ శ్రీనివాసులు(చిలకలగూడ ఇన్‌స్పెక్టర్) 87126 60753

సమాజాన్ని చైతన్యవంతం చేయాలి



మేఘ సందేశం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నర్సింహప్ప, డాక్టర్ బిక్కి కృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కవులు, రచయితలు ఆధ్యాత్మిక రచనలతో సమాజాన్ని చైతన్యవంతం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నర్సింహప్ప అన్నారు. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన ప్రముఖ రచయిత భువనేశ్వరి మారెపల్లి రాసిన మేఘ సందేశం పుస్తకావిష్కరణ సభ బాగ్‌లింగంపల్లిలో సోమవారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధ్యాత్మిక నేపథ్యంలో మేఘ సందేశం పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. కుసుమ ధర్మన్న ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రాధాకుసుమ మాట్లాడుతూ భారతీయ పురాణ ఇతిహాసాల సారాంశాన్ని సరళమైన భాషలో సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా రాశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రభ ఎడిటర్ వై.ఎస్.ఆర్.శర్మ, ప్రముఖ కవులు డాక్టర్ జల్ది విద్యాధర్, శ్రీనాథ్, డాక్టర్ కావురి శ్రీనివాస్, జి.నవీనారాణి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని పీడీఎస్‌యూ అధ్యక్షుడు బొల్లగ్గరి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెగా డీఎస్సీ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో కామన్‌ఫీజు విధానాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఎస్.బాలరాజు, జి.లింగం, చరణ్, సాయినాథ్, శివకుమార్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రులకు ఘనంగా స్వాగతం పలుకుదాం



సమావేశంలో మాట్లాడుతున్న గౌతంరావు

కాచిగూడ: కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించి ఈనెల 19వ తేదీన మొదటిసారిగా నగరానికి వస్తున్న జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో కన్వీనర్ శ్యామ్‌రాజ్ అధ్యక్షతన అంబర్‌పేట నియోజకవర్గ కోర్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ తేదీన సాయంత్రం 4 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు ఎడెల్లి అజయ్ కుమార్, సి.కృష్ణాగౌడ్, కె.రమేశ్ యాదవ్, ఎక్కాల కన్నా, పుట్ట పాండురంగయ్య, కార్పొరేటర్ వై.అమృత, కేసరి నర్సింగ్ యాదవ్, మూల రవీందర్ గౌడ్, వనం రమేశ్, ఇఎస్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ కోచింగ్



ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులతో వినయ్‌కుమార్, నారాయణ

చిక్కడపల్లి: రుద్రమదేవి షోటోకన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ ముగింపు వేడుకలను సోమవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ టీఆర్‌టీ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణకు దోహద పడుతుందన్నారు. రుద్రమదేవి షోటోకన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ మాస్టర్ నారాయణ, ఎస్‌కేడీఏ చీఫ్ ఎగ్జామినర్ క్యోషి, డాక్టర్ రవి, ఫౌండర్ షిహన్, ఎస్.లక్ష్మీ, బసవరాజు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సిగరెట్ ప్యాకెట్ల చోరీపై ఫిర్యాదు

వెంగళరావునగర్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి ఏరియాల్లో కుక్కలు తప్పి పోయాయంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే లేనిది, తాను సిగరెట్లు పోయాయని కంప్లైంట్ ఇస్తే తప్పేంటని అనుకున్నాడో ఏమో ఓ దుకాణదారుడు సోమవారం నేరుగా మధురానగర్ పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. సిగరెట్ ప్యాకెట్లు కూడా తన కష్టార్జితమే నంటూ పోలీసులను కేసు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన ఎ.రమేష్ అనే వ్యక్తి ఆరు నెలలుగా యూసుఫ్‌గూడ బస్తీలో టీ దుకాణం నడుపుతున్నాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి షాపు మూసి 15 ఉదయం ఓపెన్ చేయడానికి వచ్చాడు. కాగా తన షాపును గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టి ఉండటాన్ని గమనించాడు. షాపును పరిశీలించగా అందులో ఉండాల్సిన 30 ప్యాకెట్ల సిగరెట్లు, దాంతో పాటుగా రూ. 5 వేలు నగదు మాయం అయ్యాయి. బాధితుడు చుట్టుపక్కల విచారించిన అనంతరం సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. సిగరెట్ ప్యాకెట్ల కోసం ఫిర్యాదు ఏందని అనుకున్న పోలీసులు చివరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

లిబర్టీ: ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అఖిలభారత అసంఘటిత కార్మిక, ఉద్యోగుల సంఘం ఆటో విభాగం రాష్ట్ర శాఖ విజ్ఞప్తి చేసింది. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక మల్లేష్ సారథ్యంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ. 12 వేలు వెంటనే చెల్లించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ. 12 వేలు చెల్లిస్తామని ఎన్నికల ప్రణాళికలు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఉపాధి లేక ఆటోలు అద్దెకి తీసుకొని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు బ్యాంకు ప్రధాన రుణాలు ఇప్పించాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారుల నుంచి వేధింపులు ఆపాలని విన్నవించారు. స్పందించిన మంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 12 వేలు చెల్లిస్తామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారన్నారు.

గురువులను స్మరించుకోవడం గొప్ప సంస్కారం



చిక్కడపల్లి: గురువులను స్మరించుకోవడం గొప్ప సంస్కారమని ఎమ్మెల్సీ సురభీవాణీదేవి అన్నారు. భారత చూడామని ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ప్రముఖ నాట్యగురువు సువర్ణలత గురువులు కె.లక్ష్మణ్, జగన్నాథశర్మ సంస్మరణ సభను సోమవారం రాత్రి నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సువర్ణలత ఐదు దశాబ్దాలకు పైగా కూచిపూడి నాట్యంలో వందలమందికి శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దారన్నారు. సాహితీ, లక్ష్మీ దినేష్, శ్రీవల్లిశర్మ పాల్గొన్నారు.